క్లుప్తంగా

నేటి నుంచి అన్నదాన సత్రం ప్రారంభోత్సవాలు

తెలకపల్లి: పుణ్యక్షేత్రమైన శ్రీశైల మల్లికార్జున స్వామి దేవాలయ సమీపంలో ఆర్యవైశ్య దివ్య సేవాదామం శ్రీమల్లికార్జున అన్నదాన సత్ర సంఘం ప్రారంభోత్సవం చేయనున్నట్లు ఆ సత్రం ప్రధాన కార్యదర్శి బలుస శ్రీరాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. శ్రీశైలంలో ఆర్యవైశ్య మల్లికార్జున అన్నదాన సత్ర సంఘం ఈ నెల 29 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ నెల 30న మంత్రులు నిరంజన్‌రెడ్డి, హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్సీలు గోరెటి వెంకన్న, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్ యాదవ్, హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు పాల్గొననున్నట్లు తెలియజేశారు.

విశ్వబ్రాహ్మణులకు రుణాలు అందించాలి

తాడూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో చేతివృత్తుల ఆధారంగా చేసుకుని జీవనం కొనసాగిస్తున్న విశ్వబ్రాహ్మణులు ఆర్థికంగా ఎదిగేందుకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందజేసి ఆదుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు భాస్కరాచారి, తిరుపతయ్య, అనంతరాం, బాలకృష్ణ తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక చెన్నకేశవాలయ ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ సాధించడంలో విశ్వబ్రాహ్మణుల పాత్ర ఎంతో ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వారి జీవన పరిస్థితులు పరిశీలించి అర్హులైన వారందరికీ పింఛన్లు, బ్యాంకు ద్వారా రుణాలు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.

కమలం జెండా ఎగరేద్దాం

కల్వకుర్తి రూరల్: ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేసి కల్వకుర్తిలో బీజేపీ విజయానికి కృషి చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు నర్సింహ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో శేఖర్‌రెడ్డి మాట్లాడారు. యువతను పార్టీ వైపు ఆకర్షించడంతో పాటు కొత్త ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మంజుల రాఘవేందర్ గౌడ్, దుర్గాప్రసాద్, శేఖర్‌రెడ్డి, ఇందిర, రవిగౌడ్, విజయ్, అభిలాష్‌రెడ్డి, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజను కొనుగోలు చేయాలి

బిజినేపల్లి: యాసంగిలో రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యం ప్రతి గింజను ప్రభుత్వమే కొనాలని, వరిధాన్యం కొనుగోలులో తాలు, తరుగు పేరుతో రైతులను నష్టపర్చకుండా కొనాలని బీజేపీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ దిలీపాచారి డిమాండ్ చేశారు. ఆదివారం తిమ్మాజిపేట మండలంలోని బుద్దసముద్రం మీదుగా ప్రయాణిస్తుండగా.. రోడ్డుపై ఆరబోసిన వరిధాన్యంను పరిశీలించి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సొంత మండలంలోని రైతుల కష్టాలు తీర్చలేకపోతున్నాడని ఆరోపించారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు

కల్వకుర్తి రూరల్: క్రీడలతో స్నేహ సంబంధాలు మానసిక దృఢసంకల్పం లభిస్తాయని ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి, శివాజీ సేవా సమితి అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన రవికుమార్ జ్ఞాపకార్థం పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. సంతుయాదవ్, చందు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మన్ననూర్: స్థానిక జంగాల కాలనీలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ నేనావత్ శ్రీరాం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మన్ననూర్ గ్రామాభివృద్ధిలో భాగంగా ఇప్పటికే గ్రామంలోని అంబేడ్కర్, లింగమయ్య, వేణుగోపాల స్వామి ఆలయం, పాతబజార్ కాలనీల్లో సీసీ రోడ్లు వేశామన్నారు. సీసీ రోడ్లతో పాటూ అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీలకు మరమ్మతు చేయడంతో పాటూ ఆలయాలు, మసీద్, చర్చిల పరిసరాల పరిశుభ్రత, ప్రకృతి వనాలు, పార్కులు ఏర్పాటు చేసి గ్రామాన్ని సుందరీకరిస్తామని అన్నారు. రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ, షమీముల్లా, నిరంజన్, మహేదర్‌గౌడ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బొడ్రాయి ఉత్సవాలు

వెల్దండ: మండల పరిధిలోని అజిలాపూర్‌లో బొడ్రాయి ఉత్సవాలు ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా హనుమాన్ దేవాలయ ఆవరణలో కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతాపూజలు, ఆదివాస హోమాలు, ధాన్యాధివాసం, పుష్పాదివాసం, జపములు, మంత్ర పుష్పము తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నాభిశిల (బొడ్రాయి) ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. వేదపండితులతో డబ్బు వాయిద్యాలు మధ్య ఘనంగా ఊరేగింపు చేపట్టినారు. లక్ష్మమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

కళాశాల విద్యకు దూరం

- హామీలకే పరిమితమైన నేతల మాటలు
- ఇంటర్‌కు దూరమవుతున్న బాలికలు


లింగాల కళాశాల ఏర్పాటుకు అనువుగా ఉన్న లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

లింగాల: నల్లమల అటవీ ప్రాంత పేద విద్యార్థులు కళాశాల చదువులకు దూరమవుతున్నారు. మండల కేంద్రం లింగాలలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. అధికంగా ఉండే గిరిజన విద్యార్థులకు అందుబాటులో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో ప్రతిఏటా 400 మంది విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణులవుతుండగా.. ఇంటర్ చదువులకు అవస్థలు పడుతున్నారు.

సగం మంది దూరం

మండలంలో ప్రతిఏటా పదో తరగతి ఉత్తీర్ణత శాత మెరుగు పడుతున్నప్పటికీ ఇంటర్ విద్యకు సగానికి పైగా విద్యార్థులు దూరమవుతున్నారు. మండలంలో లింగాల, అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా.. కస్తూర్బా బాలికల విద్యాలయం ఉంది. ప్రైవేటుకు దీటుగా కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ విద్య కొనసాగుతుంది. ఆయా పాఠశాలల్లో పదో తరగతి పాసైన వారిలో ఆర్థిక స్థోమత ఉన్న వారు ప్రైవేటు కళాశాలలకు వెళ్తుండగా.. పేద విద్యార్థులు ఎక్కడికి వెళ్లక మధ్యలోనే చదువులకు స్వస్తి పలుకుతున్నారు.

20 కిలోమీటర్లు వెళ్లాల్సిందే..

మండలం నుంచి కళాశాల విద్యకు 20 కిలోమీటర్ల దూరంలోని అచ్చంపేట, కొండనాగుల, తెల్కపల్లి ప్రాంతాలకు వెళ్తున్నారు. బాలురకు ఎలాంటి సమస్య లేకపోయినా బాలికలను పంపడంలో తల్లిదండ్రులు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది.

పాలకులకు పట్టింపేది

నల్లమల ప్రాంతంలో జూనియర్ కళాశాల ఏర్పాటు విషయంలో పాలకులకు పట్టింపు లేదని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ఎన్నికల వాగ్దానంగా కళాశాల ఏర్పాటును వాడుకుంటున్నారని విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కళాశాల ఏర్పాటుకు అనువుగా ఉన్నప్పటికీ నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల సమయంలోనైనా విద్యార్థుల కల నెరవేరేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అందుబాటులో ఉండాలి



మాలాంటి పేద విద్యార్థులకు ఉన్నత చదువులు భారంగా, దూరంగా మారుతున్నాయి. అందుబాటులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంటే ఎంతో మేలు జరుగుతుంది. ఇతర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులు తప్పుతాయి.

– శివనర్సింహ, విద్యార్థి అంబట్‌పల్లి

చదువులకు దూరం



నా లాంటి బాలికలు చదువులకు దూరం కాకుండా ఉండాలంటే అందుబాటులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండటం ఎంతో అవసరం. ప్రతిఏడాది పాలకులు, అధికారులు హామీలు ఇస్తున్నారే గాని అమలుకావడం లేదు.

– అనూష, విద్యార్థిని అంబట్‌పల్లి

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


వెల్దండలో..


చారకొండలో..

వెల్దండ: మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం పాఠశాల దశలో అనుభవాలను వివరించారు. ప్రస్తుతం వివిధ ఉద్యోగాలు, వ్యాపారులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, చిన్న నరసింహారెడ్డి, రఘురాములు, శ్రీరాములు, వెంకట్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చారకొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో..

చారకొండ: చారకొండ జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల 1994–95 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు మండల కేంద్రంలో సాయితిరుమల పంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పూర్వవిద్యార్థులు అందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.

గురుకులంలో..

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం గురుకుల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 23 ఏళ్ల తర్వాత కలుసుకున్న ఆనాటి విద్యార్థులు ఒక దగ్గర చేరి తమ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2001–02 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మండల కేంద్రంలోని సీఎంఆర్ గార్డెన్‌లో ఆదివారం సమ్మేళనాన్ని నిర్వహించారు.


లింగాల గురుకులంలో..


పెద్దకొత్తపల్లిలో..

రిజర్వాయర్ బాధితులకు న్యాయం చేయాలి

వెల్దండ: గోకారం చెరువు రిజర్వాయర్‌లో భూములు, గ్రామాలు కోల్పోతున్న బాధితులకు న్యాయమైన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం వెల్దండలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రిజర్వాయర్ బాధితులకు పరిహారం అందిస్తామని, దాదాపుగా 4 ఏళ్ల కిందట భూములు స్వాధీనం చేసుకున్నారు. నేటికి పరిహారం అందలేదన్నారు. గోకారం చెరువు పెద్దగా ఉండటంతో చుట్టుపక్కల గ్రామాలకు సాగునీరు పారుతుండేది. రిజర్వాయర్ పేరుతో చెరువు కట్టను ధ్వంసం చేసి నీరు నిల్వ ఉండకుండా చేశారన్నారు. ఇప్పటి వరకు పనులు చేపట్టకుండా వదిలేశారన్నారు. దీంతో దాదాపుగా 1500 ఎకరాలు భూములు బీడుగా మారడమే కాకుండా మత్స్యకారులు ఉపాధి కోల్పోయి వలసలు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం న్యాయం చేసేలా పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు.

మండలానికి చేరుకున్న సీఎల్పీ నేత పాదయాత్ర

తాడూరు: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదివారం మండలంలోని యత్మతాపూర్, తుమ్మలసూగూరు, ఇంద్రకల్, తాడూరులో కొనసాగింది. ప్రతి గ్రామంలో సీఎల్పీ నేతకు ప్రజలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లోని సమస్యలు అడిగి తెలుసుకుని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, వచ్చిన వెంటనే గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చడంతో పాటు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. లక్ష్మయ్య, చంటి, రాఘవేందర్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

సారా పట్టివేత

ఉప్పునుంతల: మండల కేంద్రం జెడ్పీహెచ్‌ఎస్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం సారా తరలిస్తున్న దేవదారికుంట తండాకు చెందిన రామావత్ రాజేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. అతని వద్ద 8 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

సంపత్‌కుమార్‌కు సేవారత్న అవార్డు


అవార్డు అందజేస్తున్న హీరో సుమన్

నాగర్‌కర్నూల్ రూరల్: వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం నిర్వహిస్తూ వారి సమస్యలు పరిష్కరించడంలో ముందుండి సేవలందించిన రాష్ట్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు నాగర్‌కర్నూల్‌కు చెందిన బీఎస్ సంపత్‌కుమార్‌కు సేవారత్న అవార్డు అందజేశారు. ప్రతి ఏడాది సినిమా హీరో సుమన్ చేతుల మీదుగా వారి ట్రస్టబుల్ నుంచి అందజేస్తున్న ఈ సేవారత్న 2023 అవార్డుకు గాను బీఎస్ సంపత్‌కుమార్ పేరును ఎంపిక చేసి నెల్లూరు జిల్లా కేంద్రంలో హీరో సుమన్ చేతుల మీదుగా ఆదివారం అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడారు. తనకు సేవారత్న అవార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో కార్మికుల సంక్షేమంపై మరిన్ని పోరాటాలు ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. అవార్డును అందజేసిన హీరో సుమన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతికి సంతాపం


శివానందం(ఫైల్)

కొల్లాపూర్: మండలంలోని కుడిక్కిళ్లకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగం శివానందం(46) గుండెపోటుతో మృతిచెందారు. శనివారం అర్ధరాత్రి చాతిలో తీవ్ర నొప్పి రావడంతో చికిత్స నిమిత్తం గ్రామం నుంచి కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శివానందం గతంలో పాలమూరు– రంగారెడ్డి నిర్వాసితుల పక్షాన పోరాటాలు చేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందాడు. మొదట్లో టీడీపీలో క్రియాశీల నేతగా ఎదిగిన శివానందం తర్వాతి కాలంలో టీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో పనిచేశారు.

అంతిమయాత్రకు నేతల హాజరు

శివానందం మృతదేహానికి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లురవి, ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, పార్టీ నేతలు చింతలపల్లి జగదీశ్వర్‌రావు, కాటమోని తిరుపతమ్మ కృష్ణయ్యగౌడ్, రంగినేని జగదీశ్వరుడు, రాముయాదవ్, డాక్టర్ పగిడాల శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రావు, కారంగి బ్రహ్మయ్య, వేణుగోపాల్‌యాదవ్‌తో పాటు పలువురు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు నివాళి అర్పించారు. కొల్లాపూర్‌లో అంతిమయాత్ర నిర్వహించి, కుడికిళ్లలో అంత్యక్రియలు నిర్వహించారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

అచ్చంపేట: పర్యావరణాన్ని కాపాడటంలో పట్టణ ప్రజల సహకారం ఎంతో అవసరమని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 17వ వార్డు టంగాపూర్ కాలనీలో మేర లైఫ్ మేర స్వచ్ఛ షెహరా కార్యక్రమంలో ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూ, రీసైక్లిన్) సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలు తమ ఇళ్లలోని పొడి చెత్తను మున్సిపల్ వాహనాల్లోనే వేయాలని కోరారు. ప్లాస్టిక్‌బాటిల్, పాత బట్టలు, పాత చెప్పులు, పాత బుక్కులు వంటి వస్తువులను ఆర్ఆర్ఆర్ సెంటల వద్ద ఇచ్చి వాటిని రీసైకిల్ చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బాల్‌రాంనాయక్, శ్రీనివాసులు, రమేష్‌రావు, శివ, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యేకు తెలియకుండా కార్యక్రమాలు తగవు’

కల్వకుర్తి రూరల్: నియోజకవర్గంలోని బోకారంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు ఎలాంటి సమాచారం లేకుండా కార్యక్రమాలు చేయడం తగదని మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు మనోహర్‌రెడ్డి ఆక్షేపించారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతులను రెచ్చగొట్టేలా అధికార పార్టీ పదవుల్లో ఉన్న వారు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఎల్లికట్టలో సమావేశం నిర్వహించినప్పుడే ఫిర్యాదు చేశామని, మళ్లీ మరో సారి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి ఎమ్మెల్యేను అవమానించేలా చేయడంపై సీఎం కేసీఆర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. నిరంతరం ప్రజల్లో ఉండి పట్టణంలో ఎన్నడూ జరగని అభివృద్ధిని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చేస్తున్నారని అన్నారు. బాలయ్య, మధు, శ్రీకాంత్, అంజియాదవ్ ఉన్నారు.

పేదలకు అండగా ఐక్యత ఫౌండేషన్

వెల్దండ: ఐక్యత ఫౌండేషన్ గ్రామీణ ప్రాంత పేద ప్రజలందరికీ అండగా ఉండి సేవలను అందిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సిలోనిబావి తండా, పోషమ్మతండాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఐక్యత ఫౌండేషన్ పేద ప్రజలకు విద్య, వైద్యం, స్వయం ఉపాధి కలిపించడానికి ముందుకు వచ్చిందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ.. అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మంగ్లీ, మణిపాల్‌నాయక్, టాక్యానాయక్, ముత్యం, రమేష్, లాలు, సురేష్ ఉన్నారు.

రోడ్డు పనులకు శ్రీకారం

మండలంలోని కురుమిద్దెలో రోడ్డు పనులకు ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. కల్వకుర్తి నుంచి కురుమిద్దెకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు మండలాలకు ముఖ్యరహదారిగా ఉన్న రోడ్డుపై నిర్లక్ష్యం వహించడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కురుమిద్దె పర్యటనకు వెళ్లిన సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకురావడంతో స్పందించిన ఆయన ఆదివారం దాదాపు రూ.3 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు పనులను ప్రారంభించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని రాఘవేందర్‌రెడ్డి అన్నారు.


మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

‘బలగం’ స్ఫూర్తి.. బలపరిచింది


146 మంది కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం

వెల్దండ: మండల పరిధిలోని కొట్రగేట్ వద్ద అశోక్‌రెడ్డి గార్డెన్‌లో బలగం సినిమా స్ఫూర్తితో ఓ కుటుంబ ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్తి వివరాల ఇలా ఉన్నాయి. ఉప్పునుంత మండలం మర్రిపల్లికి చెందిన రేసోజు రత్నమ్మనారాయణచారి దంతులకు ఏడుగురు కుమార్తెలు, వీరంతా ఏళ్ల కిందట వివాహాలు చేసుకుని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. వీరిలో ఇద్దరు మాత్రమే ప్రస్తుతం ఉన్నారు. మిగిలిన వారు వివిధ కారణలతో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఇటీవల విడుదలైన బలగం సినిమాను స్ఫూర్తిగా తీసుకుని వారి కుటుంబ సభ్యులంతా ఒకే చోట కలవాలని నిర్ణయించుకున్నారు. హైదరాబాద్, మన్ననూర్, అమ్రాబాద్, దేవరకొండ, సిర్సనగండ్ల తదితర ప్రాంతాల్లో వీరు ఉంటున్నారు. ఈ సందర్భంగా వారిలో ఒక కమిటీ ఏర్పాటు చేసుకుని వివిధ ప్రాంతాల్లో ఉన్న 146 మంది కుటుంబ సభ్యులను ఒకే చోటికి చేర్చుకున్నారు. అందరూ ఒకే చోట కలవడం సంతోషంగా ఉందన్నారు.

నాయకుల పరామర్శ

పెద్దకొత్తపల్లి: కల్వకోలుకి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అబ్దుల్ హసన్ బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిలాష్ రావు పరామర్శించారు. కృష్ణయ్య, మద్దిలేటి, గోపాల్, శివన్న, ఉస్సేన్, ఈశ్వరయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

కల్వకుర్తి రూరల్: ఎన్టీఆర్ జయంతిని ఆదివారం కల్వకుర్తిలో వేర్వేరుగా నిర్వహించారు. ముందుగా టీడీపీ నాయకుడు రాజుగౌడ్, బ్రహ్మంల ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కొల్లాపూర్: సినీనటుడు ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను ఆదివారం కొల్లాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. స్థానికులకు స్వీట్లు పంచిపెట్టారు. రామస్వామియాదవ్, కురుమయ్య, సుధాకర్, ఆటో కురుమయ్య, తదితరులున్నారు.

బాలకృష్ణ అభిమాన సంఘం ఆధ్వర్యంలో...

పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. విశ్వశాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. బ్రహ్మనందరెడ్డి, లక్ష్మణ్‌గౌడ్ తదితరులున్నారు.

దేశ అభివృద్ధిని వివరించండి

బిజినేపల్లి: దేశంలో నరేంద్రమోదీ పాలనలో 9 సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధిని గ్రామంలోని ప్రతి ఒక్కరికీ వివరించాలని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ దిలీపాచారి అన్నారు. ఆదివారం తిమ్మాజిపేట మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి కార్యకర్త, నాయకుడు ఓటరుకు చేరువ అవ్వాలని, మోదీ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, యశ్వంత్, బాల్‌రెడ్డి, బాలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తాడూరు: సమాజంలోని పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలియజేయాలని నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొండా నాగేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ఉచిత రేషన్, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి సమ్మాన్ నిధి, గ్రామాల్లో శ్మశానవాటికలు, రైతువేదికలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు వంటి అభివృద్ధి పనులన్నింటికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, గ్రామీణ ప్రాంత ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించి కార్యకర్తలంతా ఇంటింటా బీజేపీ ప్రచారం నిర్వహించాలన్నారు. నరేష్, లోహిత్‌రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రభుత్వం మొండివైఖరి వీడాలి

తెలకపల్లి: ప్రభుత్వం తమపై మొండి వైఖరి వీడి సానుకూలంగా స్పందించాలని వీఓఏల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగలక్ష్మి, నీలమ్మ అన్నారు. వీఓఏలు తమ సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారానికి 42వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు సమ్మె శిబిరం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఐకేపీలో వీఓఏలుగా 18 ఏళ్లుగా పని చేస్తూ.. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ.. ప్రజలను చైతన్యం చేస్తున్నామని, మహిళలకు అందించే పథకాల గురించి వివరిస్తూ పనిచేస్తున్నామన్నారు. తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, అర్హులైన వారిని సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. నాగలక్ష్మి, నీలమ్మ, గిరిజ పాల్గొన్నారు.

నీటికి తంటాలు

తెలకపల్లి: మండల పరిధిలోని గౌరారంలో ఆదివారం నీటి కోసం గ్రామస్తులు నానా తంటాలు పడ్డారు. గ్రామానికి సరఫరా అయ్యే సంపులోని మోటార్ కాలిపోవడంతో ఆదివారం నీటి సరఫరా కాలేదు. దీంతో గ్రామస్తులు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సర్పంచ్ జమ్ములు స్పందించి వెంటనే గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా తాగు నీటి సరఫరా చేయడంతో ప్రజలకు కొంత సమస్య తీరింది. వెంటనే పంపింగ్ బోరును రిపేరు చేయిస్తామని సర్పంచ్ తెలియజేశారు.



హైమాస్ట్ లైట్లు ప్రారంభం

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మంచాలకట్టలో రూ.2.40 లక్షల వ్యయంతో ఎమ్మెల్యే నిధుల నుంచి మంజూరైన హైమాస్ట్ లైట్లను ఆదివారం సర్పంచ్ విజయ్‌కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. గ్రామస్తుల తరఫున ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. గోపి, బాలయ్య, పుల్లయ్య, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కల్వకుర్తి రూరల్: పట్టణానికి చెందిన నర్సింహచారి అనారోగ్యం బారిన పడి ఇటీవల మృతి చెందాడు. ఆదివారం మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతుడి భార్యకు రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. చంద్రకాంత్‌రెడ్డి, సభ్యులు నరేష్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నాగర్‌కర్నూల్ రూరల్: మెడికల్ కళాశాలలో ఉద్యోగాల కోసం ఈ ప్రాంతంలో అనేక మంది నిరుద్యోగులతో దరఖాస్తులు తీసుకుని దరఖాస్తుకు రూ.300 వసూలు చేసిన లెజెండ్ ఏజెన్సీ గుర్తింపును రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది కిందట నాగర్‌కర్నూల్‌కు మంజూరైన మెడికల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల కోసం లెజెండ్ ఏజెన్సీ ద్వారా దరఖాస్తులు తీసుకున్నారని, కానీ ఎవ్వరు డబ్బులు ఇస్తే వారికే ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. నిరుద్యోగులను మోసం చేసిన లెజెండ్ ఏజెన్సీపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సత్యనారాయణ, శ్రీనివాస్, ఖాదర్ పాల్గొన్నారు.

‘వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే’..


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ

అమ్రాబాద్: వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ సూచించారు. పదర మండలం రాయలగండి చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద ఆదివారం కాంగ్రెస్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని నాయకులు కార్యకర్తలు ప్రతిఒక్కరూ పార్టీ బలోపేతానికి పని చేయాలని వివరించారు. మండల స్థాయి సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామలింగయ్యయాదవ్, ప్రవీణ్ కుమార్, దశరథం, సత్యాలు, ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

దళితులందరికీ న్యాయం చేయాలి

మన్ననూర్: ఎస్సీ కార్పొరేషన్ అధికారులు అధికార పార్టీ నాయకుల చేతిలో కీలు బొమ్మలుగా మారి ఎస్సీల్లో ఒక వర్గమైన మాలలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి దాసరి వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం అంబేడ్కర్ కూడలిలో విలేకరులతో మాట్లాడారు. కార్పొరేషన్ ద్వారా దళిత వ్యవసాయ రైతులకు మంజూరు చేస్తున్న వ్యవసాయ బోర్లు ఒకే వర్గానికి చెందిన వారికి మొత్తంగా లబ్ధి చేకూరేలా నిర్ణయం తీసుకోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళిత రైతుల అభివృద్ధే ధ్యేయంగా దళితుల్లోని అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు చేపడుతామన్నారు.